పురాలకు అమృత్ ఫలాలు

■ పైపులైన్ల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు నిధులు



మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో) ● పురపాలకం ● నిధులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక సంఘాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడంలో భాగంగా ప్రజారోగ్య శాఖ రూపొందించిన వివిధ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.627.81 కోట్ల వ్యయంతో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని పాలకులు నిర్ణయించారు. ఆయా పురపాలక సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

లబ్ధి పొందని ప్రాంతాల్లో..

అమృత్ 2.0 కింద ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు వివిధ పురపాలక సంఘాల్లో పైపులైన్ల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే అమృత్ పథకం కింద మున్సిపాలిటీల్లో మంచినీటి పథకాలు, పైపులైన్ల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద కొత్తగా పైపులైన్లను విస్తరించి పథకం-1 కింద లబ్ధి పొందని ప్రాంతాల్లో పనులు చేపట్టనున్నారు.

పైపులైన్ల నిర్మాణాలకు అధనం

గతంలో అమృత్ పథకం కింద కర్నూలు, నంద్యాల, ఆదోని పట్టణాలకు నిధులు ప్రతిపాదించారు. మిగతా మున్సిపాల్టీల్లో ఏడీబీ నిధుల కింద పైపులైన్లు, మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించి ఆ మేరకు పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుతం అమృత్ 2.0 కింద ఆయా మున్సిపాల్టీల్లో పథకం-1 కింద ఎంపిక కాని ప్రాంతాలకు ప్రస్తుతం ప్రత్యేకంగా నిధులను ప్రతిపాదించారు. ప్రత్యేకించి వీకర్ సెక్షన్ ప్రాంతాలతోపాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు ఈ నిధులను ప్రతిపాదించారు.

నీటి సరఫరాకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

పురపాలకం	మొత్తం
బేతంచెర్ల నగర పంచాయతీ	45.00
బేతంచెర్ల వీకర్ సెక్షన్ కాలనీ	2.66
నంద్యాల-I	32.94
నంద్యాల వీకర్ సెక్షన్	10.47
నీటి సరఫరా, పైపులైన్ల విస్తరణ	
నందికొట్కూరు వీకర్ సెక్షన్	10.18
ఆత్మకూరు వీకర్ సెక్షన్	9.66
డోన్ మున్సిపాలిటీ	23.56
కర్నూలు నగరపాలక సంస్థ	131.00

డీపీఆర్ రూపొందించి..

అమృత్ 2.0 కింద కర్నూలు నగరపాలక సంస్థకు సింహభాగం నిధులు కేటాయించారు. కర్నూలు నగరంలో 52 డివిజన్ల పరిధిలో 6 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ప్రతిరోజూ 120 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉంది. ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ వరకే సరఫరా జరుగుతోంది. జనాభా అవసరాలకు తగ్గట్లుగా నీటి సరఫరా లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా డీపీఆర్ రూపొందించి పైపులైన్ల విస్తరణ పనులకు రూ.131 కోట్లు కేటాయించారు. మరోవైపు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి రూ.115 కోట్లు కేటాయించారు. ఆదోనిలో మురుగునీటి శుద్ధి ప్లాంటుకు రూ.116.23 కోట్లు, నంద్యాలకు రూ.103.64 కోట్లు కేటాయించారు. వీటి నిర్మాణాలు పూర్తయితే వృథా నీటిని శుద్ధిచేసి ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

కార్తిక మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

■ గర్భాలయ అభిషేకాలు నిలుపుదల


మాట్లాడుతున్న దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు జరిగే కార్తిక మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఈవో డి.పెద్దిరాజు ఆదేశించారు. దేవస్థానం పరిపాలన భవనంలో సోమవారం సమావేశం జరిగింది. ఈవో మాట్లాడుతూ 31వ తేదీ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్తిక మాసంలో తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి, ప్రాతఃకాల పూజలు జరిపిన తర్వాత 4 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించనున్నట్లు తెలిపారు. కార్తిక మాసమంతా స్వామివారి గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలిపేస్తున్నట్లు చెప్పారు. శని, ఆది, సోమవారాలు, పౌర్ణమి మినహా సాధారణ రోజుల్లో సామూహిక అభిషేకాలను పరిమితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. రుద్రహోమం, మృత్యుంజయ హోమాలు రెండు విడతలుగా నిర్వహిస్తామన్నారు. చండీ హోమాలు ఒక విడతలో జరుగుతాయన్నారు. రద్దీ రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో జరిగే కుంకుమార్చనలను ఆశీర్వచన మండపంలో జరిపించుకోవాల్సి ఉంటుందన్నారు. రోజూ ఉదయం 10.45కు అన్నపూర్ణ భవన్‌లో ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు అల్పాహార ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

గ్రామాల అభివృద్ధికే పల్లె పండగ

చాపిరేవుల (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండగ- గ్రామ పంచాయతీ వారోత్సవాలు జరుగుతున్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం గ్రామంలో మంత్రి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక సర్పంచి రాజు, పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, ఎంపీడీవో సుగుణశ్రీ, మాజీ సర్పంచి భూపాల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, బిజ్జల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాటరీ.. వరించింది

■ ముగిసిన మద్యం దుకాణాల అనుమతుల ప్రక్రియ

నంద్యాల నేరవిభాగం, బొమ్మలసత్రం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈనెల 16 నుంచి నూతన మద్యం విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. నంద్యాలలో నూతన మద్యం దుకాణాల అనుమతుల ఖరారు ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నంద్యాలలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీ డిప్ తీశారు. జిల్లాలో 105 మద్యం దుకాణాలకు సంబంధించి కలెక్టర్ రాజకుమారి, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ హనుమంతరావు, ఈఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో లాటరీ తీశారు.

● మొత్తం 105 దుకాణాలకుగాను ప్రభుత్వానికి రూ.10.35 కోట్లు వచ్చింది. దీంతో పాటు 2,221 దరఖాస్తులకు సంబంధించిన రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ రుసుం ద్వారా రూ.44.42 కోట్ల మేర ఆదాయం సమకూరింది.


కలెక్టరేట్ ఎదురుగా కనుచూపు మేర వాహనాలే..

మహిళలకు ఆరు దుకాణాలు

జిల్లాలో 105 మద్యం దుకాణాలకు 2,221 మంది దరఖాస్తు వేశారు. ఇందులో 105 మందికి దుకాణాలు కేటాయించారు. 30 మంది మహిళలు దరఖాస్తు చేయగా వారిలో ఆరుగురు దుకాణాలు దక్కించుకున్నట్లు ఈఎస్ తెలిపారు. కొంతమంది ఒకే దరఖాస్తు చేసినప్పటికీ లాటరీ తగలడంతో ఆనందంతో కేకలు వేశారు. మరికొందరు పదుల సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చినా అదృష్టం వరించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

కలెక్టరేట్ ఎదుట కోలాహలం

సోమవారం ఉదయం నుంచే ఆశావహులు, వారి అనుచరులు వేలాదిమంది కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో కోలాహలం నెలకొంది. వందలాది వాహనాలు, వేలాది మంది రాకతో ఓట్ల లెక్కింపు వాతావరణాన్ని తలపించింది. దుకాణాలు దక్కించుకున్నవారు వెంటనే 6వ వంతు డబ్బు చెల్లించాల్సి ఉండటంతో అక్కడే బ్యాంకు సిబ్బంది, అధికారులను ఏర్పాటు చేశారు. మొదట లాటరీ తగిలిన వ్యక్తి నిర్ణీత సమయానికి డబ్బు చెల్లించకుంటే రిజర్వు 1, 2 ద్వారా దుకాణాలు దక్కించుకునే అవకాశం కల్పించారు.



దుకాణం దక్కించుకున్న ఆనందంలో..


లాటరీ తీసి చూపుతున్న కలెక్టర్ రాజకుమారి

131 మంది పోలీసులతో బందోబస్తు

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 131 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు, 9 మంది సీఐలు, 15 మంది ఎస్సైలు, 44 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 54 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులను బందోబస్తుకు కేటాయించారు.

హతవిధి



కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన జలాశయాల్లో శ్రీశైలం ఒకటి. దీని గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. దీని కింద లక్షలాది ఎకరాలు సాగవుతున్నాయి. ఇంతటి కీలకమైన ప్రాజెక్టును ఇంజినీర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించి పెద్దఎత్తున నిధులు సమకూరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పనులను పర్యవేక్షణ చేయాల్సిన నిపుణులైన ఇంజినీర్లు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

భారీగా నిధుల కేటాయింపు

శ్రీశైలం ప్రాజెక్టును ఏళ్ల తరబడి ప్లంజ్‌పూల్ సమస్య వేధిస్తోంది. ఫలితంగా జలాశయానికి పెనుముప్పు ఉందని.. దీనిని వెంటనే పూడ్చేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ అధికారులు నిధుల కోసం నివేదికలు సమర్పించినా పట్టించుకోలేదు. డ్యామ్‌కు ముప్పు పొంచి ఉందని విన్నవించినా తీసుకున్న చర్యలు శూన్యమే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జలాశయంపై దృష్టి సారించింది. ప్లంజ్‌పూల్ సమస్యకు సంబంధించి సర్వే చేసేందుకు ఇటీవల రూ.14.70 కోట్లు విడుదల చేసింది. మరోవైపు డ్రిప్ పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈనెల 7న ప్రపంచ బ్యాంకు అధికారులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. అనంతరం ఆధునికీకరణకు రూ.104 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించారు. ఇలా నిధులు పూర్తిస్థాయిలో సమకూరుతున్నా.. పర్యవేక్షణకు అవసరమైన ఇంజినీర్లు అందుబాటులో లేరు.

ఇక్కడికొచ్చేందుకు విముఖత

శ్రీశైలం జలాశయం వద్ద విధులు నిర్వహించేందుకు పలువురు సుముఖత వ్యక్తం చేయడం లేదన్న విమర్శలున్నాయి. అటవీ ప్రాంతం కావడంతో పాటు అవసరమైన వసతులు లేకపోవడంతో చాలామంది ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొనడంతో గత నెలలో శ్రీశైలం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి జల వనరుల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దృష్టిసారించి అవసరమైన ఇంజినీర్లను నియమించి ప్రాజెక్టు పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

పోస్టుల భర్తీ ఎన్నడో..

శ్రీశైలం జలాశయంలో ఎస్ఈగా శ్రీరామచంద్రమూర్తి రెండేళ్ల కిందట బాధ్యతలు చేపట్టారు. డ్యామ్ పరిధిలో ముగ్గురు ఈఈలకు గాను రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఇద్దరు ఈఈలను నియమించినా ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. 11 మంది డీఈఈలకు గాను ఇద్దరే ఉండటం గమనార్హం. ఏఈఈలు 44 మందికిగాను 9 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఉన్న 9 మంది ఏఈఈల్లో ఐదుగురు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం 40 పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం. ఫలితంగా ఎక్కడి పనులక్కడే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.

● జలాశయానికి ఈ ఏడాది 1,020 టీఎంసీలకుపైగా వరదనీరు వచ్చింది. ఇంజినీర్ల కొరత నేపథ్యంలో ఇతర సర్కిళ్ల నుంచి డిప్యూటేషన్లపై పలువురికి కొద్దిరోజుల పాటు బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

ధర దగా.. అప్పులే మిగలగా

■ మొక్కజొన్న రైతుల ఆవేదన

ఆరుగాలం కష్టపడి పంట పండించారు.. మంచి ధర లభిస్తుందని ఆశించారు. మొక్కజొన్న దిగుబడులు చేతికొచ్చే సమయంలో ధర తగ్గడంతో తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. చివరికి వచ్చిన ధరకు అమ్మేసుకుంటున్నారు. అప్పులు మూటగట్టుకుంటున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని పేర్కొంటున్నారు.

నందికొట్కూరు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే

గత నెల ప్రారంభంలో మొక్కజొన్న క్వింటా ధర రూ.3,100 పలికింది. కొన్ని రోజులకు రూ.2,800కు పడిపోయింది. ప్రస్తుతం రూ.2,200కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు.. అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతినడంతో ఎకరాకు 10 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. మధ్య దళారుల వ్యవస్థతో రోజురోజుకు ధరలు పడిపోతుండటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. గతేడాది క్వింటా సుమారు రూ.2,500 వరకు కొనుగోలు చేయగా.. ప్రస్తుతం ధర తగ్గించేశారు.


రహదారిపై ఆరబెట్టిన మొక్కజొన్న దిగుబడులు

నియోజకవర్గం	రైతులు	సాగు (ఎకరాల్లో)
శ్రీశైలం	6,500	15,000
నందికొట్కూరు	21 వేలు	57,078
నంద్యాల	740	2,150
పాణ్యం	1,800	5,134

79 వేల ఎకరాలకుపైగా సాగు

నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో భాగంగా 79,362 ఎకరాల్లో సుమారు 49 వేల మంది రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతు ఎకరాకు అదనంగా మరో రూ.15 వేలు వెచ్చించారు. ఎకరం పంట సాగుకు విత్తనం రెండు ప్యాకెట్లు రూ.2,400, విత్తుకునేందుకు కూలీలు తదితరాలు కలిపి రూ.3,200, కలుపు తీసేందుకు కూలీలు రూ.1,200.. ఇలా అన్నీ ఖర్చులు కలిపి రూ.26,840కుపైగా ఖర్చు చేశారు.

రూ.30 వేలు పెట్టుబడి పెట్టా : వెంకటేశ్వర్లు, మిడుతూరు



నేను ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. దిగుబడి 15 క్వింటాళ్లు వచ్చింది. నాలుగు ఎకరాల్లో పంట సాగు చేయగా 60 క్వింటాళ్లు వచ్చాయి. ధర చూస్తే రోజురోజుకు తగ్గిపోతోంది. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. గత నెలలో కురిసిన వర్షాలు పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయానికి 1,43,121 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.50 అడుగులు, నీటినిల్వ సామర్థ్యం 202.0439 టీఎంసీలుగా నమోదైంది. కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,967 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

అల్పపీడనంతో భారీ వర్షాలు

■ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ జి.రాజకుమారి సోమవారం తెలిపారు. కంట్రోల్ రూంలో 0514- 293903, 08514- 293908 ఫోన్ నంబర్లు ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు మూడు షిఫ్ట్‌లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా అధికారులు స్థానికంగా ఉంటూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో మట్టి మిద్దెలు, సంక్షేమ వసతిగృహాలు, పాఠశాల భవనాలపై దృష్టి సారించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పవిత్రోత్సవం.. పరమపావనం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పూజా కైంకర్యాల్లో దొర్లిన తప్పులు, దోషాల నివారణకు లోక సుభిక్షం కోసం నిర్వహించే పవిత్రోత్సవాలు అహోబిలంలో వైభవంగా సాగుతున్నాయి. ఎగువ అహోబిలంలో సోమవారం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అలంకరించి పవిత్రాలను ధరింపజేశారు. హోమ మండపంలో స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమగుండంలో హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను అలంకరించి పల్లకిపై కొలువుంచి తిరువీధి ఉత్సవం జరిపారు.

చేనేతకు ఆదారమేదీ!

■ గతంలో మూడు క్లస్టర్ల మంజూరు ■ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందిస్తే ఎందరికో లబ్ధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, కోడుమూరు, గూడూరు, గోనెగండ్ల, నాగలదిన్నె, నందవరం, నంద్యాల, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో చేనేత వృత్తిపై ఆధారపడి జీవించేవారు అధికంగా ఉన్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 31 వేలకుపైగా చేనేత కుటుంబాలు ఉండేవి. కష్టానికి తగ్గ ప్రతిఫలం లేకపోవడంతో చాలామంది ఈ వృత్తికి దూరమయ్యారు. ప్రస్తుతం 20 వేల మగ్గాలున్నాయి. వీటిపై ఎక్కువగా పట్టుచీరలు, సిల్క్, చేనేత వస్త్రాలు, దుప్పట్లు, తువ్వాళ్లు, గద్వాల పట్టు, ధర్మవరం సిల్క్ వంటివి తయారు చేస్తున్నారు. వీరంతా మాస్టర్ వీవర్స్ కింద పనిచేస్తూ కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్కో చేనేత మగ్గానికి కనీసం రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుండటంతో కార్మికులు సొంతంగా ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. క్లస్టర్ ద్వారా వస్తే సొంతంగా మగ్గాలు, ముడిసరకు, నేసిన చీరలకు సొంతంగా మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశముంది.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే :



ఎంతో మేలు జరుగుతుంది

– శంకరన్న, చేనేత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు



ప్రస్తుతం మారుతున్న సమాజానికి అనుగుణంగా చేనేత కార్మికులు చీరలు నేస్తున్నారు. క్లస్టర్ మంజూరు చేస్తే బ్యాంకు రుణాలు, రాయితీపై ముడి సరకు లభిస్తుంది. క్లస్టర్లు మంజూరు చేయకపోవడంతో రానురాను కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు కనీసం నాలుగైదు క్లస్టర్లు మంజూరు చేయాలి.

వైకాపా ప్రభుత్వం పట్టించుకోక..

ఎమ్మిగనూరు, గుడేకల్లు, ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు-2 కింద ఐదు క్లస్టర్లు మంజూరు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గతంలో ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. పేరుకే క్లస్టర్ తప్ప కార్మికులకు పెద్దగా యంత్రాలు ఏవీ అందలేదు. ఈ నేపథ్యంలో 2019లో మళ్లీ మూడు క్లస్టర్లు ప్రతిపాదనలు పెట్టారు. వైకాపా ప్రభుత్వం కొత్త క్లస్టర్ల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న పది క్లస్టర్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించలేదు.

రాయితీపై ఆధునిక పరికరాలు

కార్మికులకు తక్కువ వడ్డీకి రుణాలు అందుతాయి. మరోవైపు ముడి సరకు తక్కువ ధరకు లభిస్తుంది. ప్రతి చేనేత కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య సేవలు సమకూరుతాయి. వారి పిల్లలకు ఉచిత విద్యా బోధన అందుతుంది. 90 శాతంతో ఆధునిక పరికరాలు మంజూరయ్యే అవకాశముంటుంది. 90 శాతం రాయితీలో మోటార్‌వైజ్డ్ జకార్డు, ఫ్రేం మగ్గం, జకార్డు యంత్రాలు, నూలు చుట్టే యంత్రాలు వంటివి ఆధునిక పరికరాలు అందుతాయి.

రూ.1.80 లక్షల పెట్టుబడి..
రూ.3 లక్షల ఆదాయం


చౌళకాయలను చూపుతున్న రైతు మద్దిలేటి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రైతు మద్దిలేటి నాలుగెకరాల పొలంలో చౌళకాయ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. విత్తనం వేసే ముందు సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని పెంచారు. పొలంలో ఆరు రోజులపాటు గొర్రెల మందలను ఏర్పాటు చేయించారు. గొర్రెల మందలు నిలిపేందుకు కాపరికి రోజుకు రూ.5 వేలు చొప్పున ఖర్చు వచ్చిందన్నారు. స్రిక్ రకానికి చెందిన చౌళకాయ విత్తనాలను కోడుమూరులో ప్యాకెట్ రూ.650 చొప్పున కొన్నారు. ఎకరానికి 7 ప్యాకెట్ల లెక్కన వేసుకున్నారు. సేద్యానికి రూ.30 వేలు ఖర్చు చేశారు. నెలకు రూ.15 వేల చొప్పున మందులు, సాగుకు వ్యయమైందన్నారు. 60 రోజులకు దిగుబడి మొదలైంది. పెట్టుబడి, కూలీలు కలిపి రూ.1.80 లక్షలు అయ్యింది. కోతకు 42 సంచులకుపైగా దిగుబడి వస్తుంది. ఒక సంచి 75 కిలోలు ఉంటుంది. కర్నూలు, హైదరాబాద్‌కు తరలిస్తూ విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు ఏడు కోతలకు రూ.3 లక్షలు ఆదాయం వచ్చినట్లు మద్దిలేటి తెలిపారు.

ఉల్లి నారు.. డిమాండు జోరు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాగులో గోనెగండ్ల, కోడుమూరు, కౌతాళం, కోసిగి, సి.బెళగల్, ఎమ్మిగనూరు మండలాలు ప్రసిద్ధి. ప్రస్తుతం ఉల్లికి మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో ఉల్లి నారుకు డిమాండు పెరిగింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు నారు కొనుగోలుకు గోనెగండ్లకు వస్తున్నారు. గత నెలలో కురిసిన అధిక వర్షాలకు ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికితోడు పంట దిగుబడులు కూడా పెద్దగా లేవు. ఉల్లి పంటకు మరింత డిమాండు పెరుగుతుండటంతో రైతులు ముందస్తు రబీ కింద ఉల్లి సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఒక ఉల్లి నారుమడి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది. ఉల్లి నారుతో ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు లాభాలు పొందినట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, గోనెగండ్ల

సమస్య సమాధానాలు

బనగానపల్లి, న్యూస్‌టుడే:

సమస్య: వరిలో ఆకులపై మధ్యలో గోధుమ రంగు అంచుతో బూడిద రంగు మచ్చలు వస్తున్నాయి. – వెంకటేశ్వరరెడ్డి, నందవరం


ధనలక్ష్మి, శాస్త్రవేత్త

సమాధానం: దీన్ని అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు అంటాం. ఈ తెగులు పిలకల కణుపుల వద్ద ఆశిస్తే పిలక వాలిపోతుంది. మెడ భాగంలో ఆశిస్తే వెన్ను విరిగి వాలిపోతుంది. వెన్నులో తాలుగింజలు లేదా సగం నిండిన గింజలు వస్తాయి. నివారణకు తెగులును తట్టుకునే రకాలు సాగు చేయాలి. 1.3 కిలోల కార్బండిజమ్‌ను లీటర్ నీటికి పొడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 75 శాతం, 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయులెన్ 40 శాతం 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 3 ఎల్ 2.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. నత్రజని ఎరువును ఎక్కువగా వాడాలి. పొలంలో నీరు లేకుండా ఆరబెట్టాలి.

సమస్య: కందిలో మొక్కలు ఎండిపోతున్నాయి. వాటిని పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ రంగు నిలువు చారలు కనిపిస్తున్నాయి. నివారణ తెలపండి. – రామచంద్రారెడ్డి, పసుపుల

సమాధానం: దీన్ని ఎండు తెగులు అంటారు. పంట మార్పిడి చేయకపోవడంతో ఈ తెగులు ఎక్కువగా సోకుతుంది. ఒకే పైరును ఏళ్ల తరబడి వేయరాదు. విత్తుకునే ముందు తప్పనిసరిగా కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌గాని మాంకోజెబ్‌గాని పట్టించి విత్తుకోవాలి. నివారణకు 80 కిలోల పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండిలో కలిపి రెండు కిలోల ట్రైకోడెర్మావిరిడి జీవ శిలింధ్రాన్ని ఎకరానికి భూమిలో కలియదున్నాలి.

శనగకు అనుకూలం



ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: అక్టోబరు 15 నుంచి శనగ సాగుకు అనుకూలం. జేజీ 11, నంద్యాల గ్రామ్ 452, నంద్యాల గ్రామ్ 857, 776, 49 రకాలు అనువైనవి. విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 2 గ్రా. కార్బండిజమ్‌తో శుద్ధి చేసుకోవాలి. మధ్యస్థ లావు గింజలైతే 30-35 కిలోలు, లావు రకాలైతే 45-50 కిలోలు ఎకరానికి విత్తుకోవాలి.

మొక్కజొన్నలో అప్రమత్తతతో తెగుళ్ల నివారణ

రైతేరాజు

బనగానపల్లి, న్యూస్‌టుడే: రైతులు మొక్కజొన్న పంట విషయమై అప్రమత్తంగా ఉంటే తెగుళ్ల నివారణ చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.బాలరాజు సూచించారు. సాధారణంగా మొక్కజొన్నలో తుప్పు తెగులు, పూత దశ అనంతరం బొగ్గుకుళ్లు తెగులు కనిపిస్తాయన్నారు.



పంట పెరిగాక ఆకులపై పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు రంగుకు మారుతాయి. దీన్ని తుప్పు తెగులు అంటాం. అలాగే నేలలో తేమ శాతం తగ్గడంతో బొగ్గుకుళ్లు తెగులు వస్తుంది. నేలలోని శిలీంధ్రం మొక్కల వేర్ల ద్వారా కాండం పైభాగానికి వ్యాపిస్తుంది. కాండంపై గోధుమ రంగు చారలు వస్తాయి. ఈ తెగులుతో పంట కోత దశకు రాకముందే కాండం భాగం విరిగిపోయి మొక్కలు నేలపై పడుతాయి. ప్రస్తుతం అక్కడక్కడ ఈ తెగులు కనిపిస్తోంది. మరో పది రోజులు దాటితే పంట కోతకు వస్తుంది. ఈ తెగులుతో అప్రమత్తంగా ఉండాలి. కోత దశకు ముందు మొక్కలు నేలపై వాలకుండా చూసుకుంటే మంచి దిగుబడి సాధించే అవకాశముంటుంది.

విత్తనశుద్ధితో మేలు

తుప్పు తెగులు నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. లేదా ముందు కిలో విత్తనానికి 2.5 గ్రాముల మాంకోజెబ్ శిలీంధ్రంతో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

బొగ్గు కుళ్లుతో..

పూత దశ నుంచి నేలలో తేమ శాతం తగ్గకుండా ఉండేలా నీటి తడులు పెట్టుకోవాలి. ఎకరానికి అదనంగా 30 కిలోల పొటాష్ వేయాలి. తెగులు ఎక్కువగా సోకే ప్రాంతాల్లో పంట వేసే ముందు పచ్చిరొట్ట పైరును సాగు చేసి నేలలో కలియదున్నాలి. ట్రైకోడెర్మా శిలీంధ్రాన్ని పశువుల ఎరువులో వృద్ధి చేసి మూడు, నాలుగేళ్లు వరుసగా నేలతో కలుపుతూ పోవాలి. పంట మార్పిడి అవలంబించాలి.

అపార్‌మైన సదుపాయాలు

☛ విద్యార్థులకు డిజిటల్ కార్డులు ☛ 9 నుంచి 12 తరగతుల వారికి ఇవ్వాలని నిర్ణయం

డోన్‌పట్టణం, కర్నూలువిద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు శాశ్వత విధానంలో గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక నంబరును కేటాయించేందుకు ప్రక్రియను కేంద్రం అమలు చేయనుంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధార్ తరహాలో 'వన్ నేషన్..వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ప్రత్యేక నంబరు (గుర్తింపు సంఖ్యను) ఇవ్వనున్నారు. పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడంతో కార్యాచరణకు కసరత్తు ప్రారంభించారు.



అపార్ కార్డు నమూనా

విద్యార్థుల పేరు, జన్మించిన తేదీ, జెండర్, క్యూ ఆర్ కోడ్, ఫొటో, 12 అంకెల ప్రత్యేక నంబరు, మార్కులు, గ్రేడ్, ఉపకార వేతనం, ప్రోగ్రెస్, విద్యా సంబంధిత వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు తదితరాలతో డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. ఆ కార్డులో వివరాలన్నీ ఒకే చోట నమోదు చేయడంతో దీన్ని స్కాన్ చేస్తే మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే సదుపాయం కలుగుతుంది.

మొదటి దఫాలో ఇలా..

ఆధార్ తరహాలో గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల వివరాలను యూ డైస్ ప్లస్‌లో అప్‌లోడ్ చేస్తారు. పాఠశాల నుంచి ఉన్నత చదువుల వరకు

బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అనుసంధానం..

అపార్ కార్డు విద్యార్థి బ్యాంకు ఖాతా, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్‌కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ పత్రాల సమర్పణ సులభతరం కానుంది. దీని ద్వారా ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ కార్డు కీలకం కానుందని అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి పాఠశాలలతో పాటు కళాశాలల్లోనూ ఆధార్‌కార్డులోని వివరాలను నమోదు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న యూ డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్ (పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇకపై అపార్‌తోనే అన్ని కార్యకలాపాలు నిర్వహించనున్నారు. అపార్ నంబరు తీసుకునేందుకు ఆయా దరఖాస్తుల్లో విద్యార్థుల ద్వారా తల్లిదండ్రుల సమ్మతి తీసుకోవాల్సి ఉంటుంది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఉన్న ఆధార్ నంబరు, అడ్మిషన్ నంబరు, విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు సమానంగా ఉంటాయి. వాటిని సరి చూసుకుని అపార్ కార్డుకు లింక్ చేస్తారు.

విద్యార్థులకు చాలా ఉపయోగం

- ఎస్వీఎస్ గురవయ్యశెట్టి, ఆర్‌ఐవో, కర్నూలు

విద్యార్థులకు సంబంధించిన వివరాలన్నీ ఒకే చోట నమోదవుతాయి. ప్రతి విద్యార్థి అపార్ కార్డు కోసం నమోదు చేసుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి గుర్తింపు నంబరు ఇస్తారు. ఒక్కసారి అపార్ నంబరు పొందితే అందులో అన్ని వివరాలు ఉంటాయి. ఐడీ స్కాన్ చేస్తే.. విద్యార్థి వివరాలు తెలుస్తాయి. నకిలీ సర్టిఫికెట్లకు అవకాశం ఉండదు. ప్రతి విద్యార్థికి చాలా అవసరం. మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్ల వివరాలు నమోదు చేయాలి.

పేదలకు అండగా అన్న క్యాంటీన్లు


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నిరుపేదల ఆకలి తీర్చి అండగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండులో రూ.9 లక్షల వ్యయంతో, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సముదాయంలో రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 100, రెండో విడుతలో 75 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించినట్లు చెప్పారు. రూ.5తోనే పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ల ప్రారంభంతో నంద్యాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ క్యాంటీన్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాబీ, నాగార్జున, సీఐలు సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శిలాఫలకం తొలగింపు

☛ పలువురి ఆగ్రహం


మురుగు కాలువపై ఉంచిన శిలాఫలకం

ఈనాడు, కర్నూలు : నంద్యాలలోని పాల ఉత్పత్తుల కర్మాగారం (విజయ డెయిరీ)లో ఎన్టీఆర్ పేరుతో ఉన్న శిలాఫలకాన్ని తొలగించడం వివాదాస్పదంగా మారుతోంది. కర్మాగారాన్ని ఎన్టీఆర్ ప్రారంభించిన సమయంలో ఆ శిలాఫలకం ఏర్పాటుచేశారు. కర్మాగారం ఆధునికీకరణ పనుల్లో భాగంగా తొలగించిన ఆ శిలాఫలకాన్ని సమీపంలోని ఓ మురుగు కాలువపై ఉంచడంపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఈ వివాదంపై దృష్టి సారించారు. వేలాది మంది పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం 1983లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆ కర్మాగారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆ సంస్థ అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం రూ.300 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరింది. ఎన్టీఆర్ విగ్రహాన్ని నేటివరకు ఏర్పాటుచేయకపోగా నంద్యాల కర్మాగారానికి ఏమీ చేయని వైఎస్ విగ్రహం పెట్టడం ఎంతవరకు న్యాయమని సామాజిక మాధ్యమాల్లో కొందరు పోస్ట్ చేశారు. దీంతో 'కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్'లో అంతర్గత విభేదాలు రేగాయి. సంస్థలో పాలకవర్గానికి, కొందరు కార్మికులకు మధ్య కొన్నేళ్ల నుంచి వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయోనన్నది ఉత్కంఠగా మారింది.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

సంస్థ ఆధునికీకరణ పనుల్లో భాగంగా తీసిన శిలాఫలకాన్ని గోడపక్కనే ఉంచగా కొందరు దానిని ఉద్దేశపూర్వకంగా మురుగు కాలువపై ఉంచారని సంస్థ ఛైర్మన్ ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డి 'ఈనాడు'కు వెల్లడించారు. ఆ ఉదంతంపై విచారణ చేయాలని, నిందితులను గుర్తించాలని పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

అవుకు, న్యూస్‌టుడే: రామాపురానికి చెందిన సాంబశివుడు (46) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం తెలిపారు. అనారోగ్యమే కారణమని ఆయన వెల్లడించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది...

అవుకు, న్యూస్‌టుడే: రామాపురానికి చెందిన చాకలి సుబ్బమ్మ(77) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం తెలిపారు. మోకాళ్ల నొప్పులతో బాధ పడేదని, చికిత్స తీసుకున్నా వ్యాధి నయం కాక పోడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన గౌతమ్ శవమై తేలాడు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం అయ్యన్ననగర్ వద్ద శనివారం సాయంత్రం సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాల్వలో పడి గల్లంతైన సురసుర గౌతమ్ (17) సోమవారం శవమై తేలాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి మహాలక్ష్మి గుండెలవిసేలా రోదించారు. వైఎస్ఆర్ జిల్లా బద్వేలు పట్టణంలోని ఐలమ్మకాలనీకి చెందిన సురసుర గౌతమ్, అతని బావ మహేశ్‌లు మహానందిలోని ఈశ్వరనగర్‌కాలనీలో బంధువుల వివాహానికి హాజరయ్యేందు వస్తూ సెల్ఫీలు తీసుకుంటుండగా గౌతమ్ కాల్వలో గల్లంతైన విషయం విదితమే. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మహానందిపారం- ఆర్ఎస్ గాజులపల్లె గ్రామాలకు మధ్యన తెలుగుగంగ కాల్వలో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ డ్రైవర్ మృతి

ప్యాపిలి, న్యూస్‌టుడే: పెద్దమ్మ దాబా వద్ద ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగిందని పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లా, హాలే నరసాపుర తాలుకా, కేరిగౌడకు చెందిన హరీష్ (45) రాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడ్ చేసుకొని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా, ప్యాపిలి పట్టణ సమీపంలోని పెద్దమ్మ దాబా వద్ద లారీని ఆపారు. టైర్లు చెక్ చేస్తూ స్పృహ తప్పి పడిపోయారు. అంబులెన్స్ సిబ్బంది పరీక్షించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం డోన్‌కు తరలించారు. మృతుడి భార్య స్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, సీపీవో వేణుగోపాల్‌తో కలిసి ఆమె సమీక్షించారు. చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద గండ్లు పడకుండా పర్యవేక్షిస్తుండాలన్నారు. కొత్తపల్లి మండలంలోని ఎద్దులేరు వాగు, నంద్యాల మద్దిలేరు వాగు, పాలేరు వాగులు పొంగితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలో 27 వేల మట్టి మిద్దెలు ఉన్నాయని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వసతిగృహాల్లో పెచ్చులూడిన భవనాల కింద పిల్లలను ఉంచకుండా జాగ్రత్తపడాలని ఆదేశించారు.

ఆకలి తీర్చడమే లక్ష్యం

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా వీటిలో భోజనం లభిస్తుందన్నారు. నందికొట్కూరు పట్టణంలోని పురపాలక కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అల్పాహారం రుచి చూశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రూ.5తోనే కడుపు నింపే అన్న క్యాంటీన్లను వైకాపా ప్రభుత్వం రద్దుచేసి పేదలను పస్తులుంచిందని విమర్శించారు. కార్యక్రమంలో ఛైర్మన్, ఉప ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి, మొల్ల రబ్బానీ, కమిషనర్ బేబీ, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

శిక్షణా నైపుణ్యాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఐటీఐల్లోని పలు ట్రేడుల్లో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన వారు అప్రెంటిస్‌షిప్‌లో చేరి నైపుణ్యాలు పొందవచ్చని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే వీలు కలుగుతుందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్ఎఎం)ను నిర్వహించారు. 66 మందికి గానూ 32 మంది ఎంపికైనట్లు ఐటీఐ టీవో నాగకేశవులు తెలిపారు. కాంచన్ కుమార్, హర్ష, శ్రీనివాసులురెడ్డి, ఐటీఐ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రసాదరెడ్డి

ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు పూజలు జరిపారు. అనంతరం నిర్వహించాల్సిన పల్లకి ఉత్సవం వర్షం కారణంగా రద్దు పరిచారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అర్చకులు

గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి 30 ఫిర్యాదులు వచ్చాయి. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి కేసీ రాముడు సోమవారం తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 21 లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, వార్షిక ఆదాయం రూ.2,50,000 ఉండాలని తెలిపారు.

లక్ష్యంపై గురి.. పతకాలతో మెరిసి

☛ పవర్ లిఫ్టింగ్‌లో మహేశ్ సత్తా



జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మహేశ్

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: లక్ష్యం ముందు పేదరికం అడ్డురాదనుకున్నాడు. కష్టం చేస్తూనే చదువుతో పాటు పవర్‌లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తున్నాడు. చదువుకుంటూనే హమాలీగా పని చేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబానికి ఆసరా ఉంటూనే తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నాడు. రోజూ ఖాళీ సమయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం వ్యాయామశాలలో కఠోరంగా శ్రమిస్తూ కళాశాలకు వెళ్లి ఆ తర్వాత హమాలీగా పనిచేస్తూ జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నారు.

నంద్యాల పట్టణం గాంధీచౌక్‌కు చెందిన యు.లక్ష్మిబాయి, యు.వెంకటేశ్వరరావుల కుమారుడు మహేశ్ డిగ్రీ తృతీయ ఏడాది చదువుతున్నారు. ఒకవైపు చదువుతూనే నంద్యాల మార్కెట్ యార్డులో హమాలీగా పని చేస్తున్నారు. చిన్న వయసులోనే బరువులు ఎత్తడం చూసిన ఓ కానిస్టేబుల్ పవర్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు పొందాలని సూచించడంతో ఖాళీ సమయాల్లో శిక్షణ పొందేవారు. ఎక్కడైన పోటీలు జరిగితే మహేశ్ పోటీలే లక్ష్యంగా పాల్గొనేవారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడమే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

సాధించిన విజయాలు

- 2021 ఫిబ్రవరిలో విశాఖపట్నం జిల్లా గంగవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించారు.
- 2022 జులైలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించారు.
- 2022 సెప్టెంబరులో జరిగిన జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రెండు స్వర్ణాలు గెలుపొందారు.
- 2023 జులైలో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రజతం దక్కించుకున్నారు.
- 2024 సెప్టెంబరులో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని కాంస్యాన్ని సాధించారు.

ఈ నెల 14 నుంచి 18 వరకు గోవాలో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం సాధనే లక్ష్యంగా పాల్గొననున్నట్లు మహేశ్ తెలిపారు.

నంద్యాల

నిబంధనల ఉల్లంఘనతోనే ప్రమాదాలు



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : రహదారి భద్రతా నియమాలు ఉల్లంఘించడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజినాయక్ పేర్కొన్నారు. కార్తిక మాసంలో శ్రీగిరిపై ట్రాఫిక్ నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై శ్రీశైలంలో సోమవారం స్థానిక ప్రైవేటు కార్లు, జీపులు, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవో డి.పెద్దిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు.

క్రీడా పోటీలు వాయిదా

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో సోమవారం నుంచి జరగాల్సిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం క్రీడా పోటీలను వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా వేస్తున్నట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి షెడ్యూల్ త్వరలో వెల్లడిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : సమస్య : పట్టణంలోని క్రాంతి నగర్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. **- నారాయణరెడ్డి**

సమస్య : పట్టణంలోని బైర్మల్ వీధిలో కాల్వలు శుభ్రం చేయడంలేదు. **- బ్రహ్మం, స్థానికుడు**

సమస్య : ఫాతిమానగర్‌లో దోమల బెడద అధికంగా ఉంది. **- నౌమాన్, స్థానికుడు**

సమాధానం : సిబ్బందికి సూచించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం.

- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో సోమవారం రాత్రి



ఆర్టీసీ బస్సులో మంత్రి ఫరూక్

మూడు నూతన బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నంద్యాల నుంచి శ్రీశైలం ఒకటి, నంద్యాల నుంచి హైదరాబాద్‌కు రెండు బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. వీటిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలోనే సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. డీపీడీవో రజియా సుల్తానా, డా.బాబన్, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాబీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రయాణం..

◆ పురపాలకల్లో అధ్వానంగా అంతర్గత రహదారులు
◆ మరమ్మతులూ కరవై.. ప్రజల అవస్థ

అరచేతిలో ప్రాణం



వైఎస్సార్ నగర్‌లో అధ్వానంగా మట్టిరోడ్డు

నంద్యాల పట్టణం, ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం నంద్యాల, ఆత్మకూరు పురపాలక సంఘాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పలు కాలనీల్లో దశాబ్దాలుగా మట్టిరోడ్లే దిక్కయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో దశాబ్దాల కిందట వేసిన సీసీ రోడ్లు ఛిద్రమయ్యాయి. ఏళ్ల తరబడి వీటికి మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రయాణానికి పనికిరాకుండా మారాయి. పట్టణాల మధ్యనున్న కాలనీల్లో సైతం ఇదే పరిస్థితి. ఇక శివారు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అధ్వాన రోడ్లపై ప్రయాణం ప్రాణాలతో చెలగాటంలా మారిందని పట్టణ వాసులు వాపోతున్నారు.

మట్టిదారులే దిక్కు

◆ నంద్యాల శివారులో నాలుగు దశాబ్దాల కిందట ఏర్పాటైన నందమూరినగర్‌లో ఇప్పటికి మట్టిరోడ్లే దిక్కయ్యాయి.

◆ 16 ఏళ్ల కిందట ఏర్పాటైన వైఎస్సార్ నగర్‌లో కూడా మట్టిదారులే ఉన్నాయి. ఈ ప్రాంతంలోని బుడగజంగాల కాలనీ, టైలర్స్ కాలనీ, టిడ్కో గృహాల సముదాయం తదితర ప్రాంతాల వీధుల్లో రోడ్లతో పాటు కాలువలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ పట్టణ నడిబొడ్డున ఉన్న ఎస్బీఐ కాలనీ శివారు ప్రాంతాల్లో కూడా మట్టి రహదారులే ఉన్నాయి. అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ అభివృద్ధి పనులు మాత్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఆత్మకూరు నుంచి దుద్యాల వెళ్లే రహదారి. ఆత్మకూరు పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్, సమీకృత వసతిగృహం, ఆర్డీటీకాలనీతో పాటు దుద్యాల, ఇస్కాల, కొక్కెరంచ గ్రామాలకు వెళ్లేందుకు ఇదే మార్గం. ఈ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు.





ఆత్మకూరు నుంచి చరకాకాలనీకి వెళ్లే రోడ్డు ఇది. ఈ మార్గంలో చరకాకాలనీ ప్రజలతో పాటు పొలాలకు వెళ్లే రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భారీ వాహనాలు వెళ్లడంతో ఈ దారి దారుణంగా దెబ్బతింది. కంకర తేలిన ఈ దారిలో నడిచి వెళ్లాలన్నా సాధ్యం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఆత్మకూరు పట్టణం మీదుగా వడ్లరామాపురం వెళ్లే రహదారి. ఈ మార్గంలో పెద్దబజారు, గొల్లపేట, ఏబీఎం పాలెం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో దశాబ్దాల కిందట వేసిన సీసీరోడ్డు ఛిద్రమై ప్రమాదకరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో రహదారి ఎగుడుదిగుడుగా ఉండటంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు.





నీటి వృథా.. వాహనదారులకు వ్యథ

పాములపాడు నుంచి చెలిమిల్ల వెళ్లే రహదారిలో తెలుగు గంగ కాలువ వంతెనపై పైపులైను లీకవుతోంది. దీంతో నీరంతా రహదారిపై నిలిచి చిత్తడిగా మారుతోంది. తెలుగు గంగ కాలువ నుంచి చెలిమిల్ల, కొత్తమాడుగుల గ్రామాలకు ఈ పైపులైను ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. లీకేజీ కారణంగా గ్రామీణులకు తాగు నీరు సరిగా అందడం లేదు. మరోవైపు దారి మొత్తం బురదగా మారడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వాల్మీకి జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో వాల్మీకులు ప్రతిఇంటా జయంతి వేడుకలు నిర్వహించాలని జిల్లా వాల్మీకి సంఘం నాయకులు బోయ రామకృష్ణ, గోవిందనాయుడు, పీవీ రమణ, చందు, సుందర్,



గోడపత్రాలు విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

శేఖర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా వాల్మీకి సంఘం నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక దేవనగర్‌లోని వాల్మీకి రామమందిరంలో సోమవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడపత్రాలను విడుదల చేశారు. నాయకులు కాశన్న, నాయుడు, తిమ్మయ్య, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం

నంద్యాల గాంధీ చౌక్, పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వసంతోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేసి



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి

వజ్రాల చీరతో అలంకరించారు. అనంతరం ఊరి విందు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు తెలిపారు.

దసరా వేషాల విజేతలకు బహుమతులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణ పోటీల్లో విజేతలకు స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా.జి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంచాలకులు టి.తులసిరెడ్డి, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు. బైటిపేట కాళి బృందం, గుడిపాటి గడ్డ అయ్యప్ప స్వామి టీం, హరిజనపేట దుర్గా బృందం సభ్యులు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు మేడా మురళీధర్, విశ్రాంత ఉపాధ్యాయిని వసుమతి, భవనాసి నాగమహేశ్, షేక్షావలి, లింగారెడ్డి, రాజా చిన్న హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

18న విద్యుత్తు కార్యాలయం వద్ద ధర్నా

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలోని విద్యుత్తు కార్యాలయం వద్ద ఈనెల 18న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు వినియోగదారులపై ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలన్నారు. వినియోగదారులపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 18న ధర్నా తలపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగుండాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : వాతావరణ మార్పుల కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగుండాలని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో సోమవారం 104 సంచార వైద్యశిబిరం నిర్వహించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడి ఆహార పదార్థాలను తినాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మధుమేహ, రక్తపోటు వ్యాధిగ్రస్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివ, సిబ్బంది భాస్కర్, విశ్వనాథ్, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే బీసీలకు పెద్దపీట

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసి గుర్తింపు ఇచ్చింది తెదేపానే అని ఆ పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి లాయర్‌బాబు పేర్కొన్నారు. పాణ్యం తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో బోయ, వాల్మీకుల కల నెరవేరిందన్నారు. ప్రాంతీయ వ్యత్యాసాలు లేకుండా వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ హుసేన్‌బీ అధికారులకు సూచించారు. పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగు నీరు, పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హుసేన్‌బీ

ఉండాలన్నారు. పలువురు సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

హిందీ పండిట్ కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన హిందీ పండిట్ ఖలీల్ అహ్మద్ కుటుంబానికి ఆల్‌మేవా, రూట సంఘాల సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆల్‌మేవా రూ.78,400, రూట తరఫున రూ.15,100తో పాటు ఇతరుల నుంచి సేకరించిన మొత్తం రూ.1.10 లక్షలను సోమవారం అందజేశారు. ఆల్‌మేవా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, ఎస్.మహ్మద్ సలీం, రూట అధ్యక్షులు సైపుల్లా, ఖాసీం, నాయకులు షాహిన్, నజీర్, అఫ్జల్, మహబూబ్ పాల్గొన్నారు.


నీళ్లట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీనివాసనగర్ పంపుహౌస్‌లో 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ట్యాంకుకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డా.బాబన్ పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

◆ ఊరూరా అట్టహాసంగా పల్లె పండగ

మహానంది, న్యూస్‌టుడే : గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలంలోని మూడు గ్రామాల్లో సోమవారం 'పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. రూ.1.34 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఈ ఏడాది ఆగస్టు 23న గుర్తించిన 60 పనులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులోభాగంగానే గాజులపల్లెలో రూ.40 లక్షలు, తిమ్మాపురంలో రూ.40 లక్షలు, గోపవరంలో రూ.33 లక్షలు, బుక్కాపురంలో రూ.21 లక్షలతో సీసీదారులు, మురుగు కాల్వల ఏర్పాటుకు భూమిపూజలు చేసినట్లు వివరించారు. కార్యక్రమాల్లో మండలాధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని, మండల తెదేపా అధ్యక్షుడు ఉల్లి మధు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి చింతం క్రాంతికుమార్ యాదవ్, యూనిట్ ఇన్‌ఛార్జి కాకర్ల శివ, మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, పీఆర్ ఏఈఈ రాజశేఖరరెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



గోపవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తదితరులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మండలంలోని కోనేటమ్మపల్లి, జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు గ్రామాల్లో సోమవారం ఆయన సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మిడుతూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో పలు అభివృద్ధి పనులతో తెదేపా ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించిందని ఆ పార్టీ నాయకులు ఇద్రిస్, సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవో దశరథ రామయ్య, ఈవోఆర్డీ, పీఆర్ ఏఈతో కలిసి సోమవారం వారు భూమిపూజ చేశారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సంకిరేణిపల్లె గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల ప్రత్యేకాధికారి పరమేశ్వరి సోమవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, విద్యాశాఖ అధికారులు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ, ఐసీడీఎస్ సిబ్బంది, తెదేపా నాయకులు దామోదర్‌రెడ్డి, ఎల్లయ్య, హనుమన్న, తదితరులు పాల్గొన్నారు.



కోనేటమ్మపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

వెలుగోడు, న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం గ్రామంలో రూ.20 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో మధుసుదన్ రెడ్డి తెలిపారు. పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మాధవరం గ్రామంలో ఆయన అధికారులతో కలిసి సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచి బ్రహ్మానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పల్లెల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని ఎంపీడీవో సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం, ఇందిరేశ్వరం గ్రామాల్లో సోమవారం పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజలు చేశారు. పీఆర్ ఏఈ సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పాణ్యంలో ఉప సర్పంచి రమణమూర్తి రహదారి పనులకు భూమిపూజ చేశారు. నెరవాడలో తెదేపా నాయకుడు విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు.

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని బిలకలగూడూరు, ఆళ్లగడ్డ, బూజునూరు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా నాయకులు సుదర్శనరెడ్డి, రఫీక్, ప్రకాష్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, ఏపీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తెళ్లపురి (గోస్పాడు), న్యూస్‌టుడే : మండలంలోని తెళ్లపురి, రాయపాడు, ఎస్.కూలూరు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెళ్లపురి సర్పంచి సుధామణి, తెదేపా మండల ఇన్‌ఛార్జి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ఎంపీడీవో అమానుల్లా, ఈవోఆర్డీ నాగఅనసూయ, పీఆర్‌ఏఈ పుల్లయ్య, ఏపీవో నాగజ్యోతి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సోయా.. దళారుల మాయ

◆ వర్షానికి తడిసిన దిగుబడులు ◆ క్వింటా రూ.4,400 నుంచి రూ.800కు తగ్గింపు



కల్లాల్లోనే సోయాపంట నిల్వలు

పాణ్యం, న్యూస్‌టుడే : సకాలంలో వర్షాలు కురిశాయి. పంట దిగుబడులు బాగా వచ్చాయి. నూర్పిడి చేసి కల్లాల్లో పంటను ఆరబెట్టారు. రెండు రోజుల్లో దిగుబడులు విక్రయిస్తాం.. మూడు నెలల కష్టానికి ప్రతిఫలం ఇంటికి వస్తుంది.. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చవచ్చన్న అన్నదాతల ఆశలపై ఒక్క వర్షం నీళ్లు చల్లింది. దిగుబడులు నీటి పాలయ్యాయి. తడిచిన పంటను కొనేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు ముందుకు రాలేదు. ఇదే అదనుగా దళారులు రంగంలోకి దిగారు. అతి తక్కువ ధరకే కొంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కరిమద్దెల, పెసరవాయి గ్రామాల్లో సోయాబీన్ పంట తడిచిపోయి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.

◆ ఖరీఫ్‌లో గడివేముల, ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, నందికొట్కూరు, పాణ్యం తదితర మండలాల పరిధిలో 30 వేల ఎకరాలకు పైగా సోయాబీన్ పంట సాగుచేశారు. ఒక్క గడివేముల మండలంలోనే 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగైంది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొదట్లో క్వింటా రూ.4,400 చొప్పున కొనుగోళ్లు చేపట్టారు. ఈనెల 4న గడివేముల మండలంలో భారీ వర్షం కురిసింది. పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన సోయా దిగుబడులు నీట మునిగాయి. సుమారు 300 ఎకరాల్లో పండించిన దిగుబడులు నీట మునిగి తడిచిపోయాయి. సోయాబీన్ ధాన్యం మొలకలొచ్చింది. మిగతా ప్రాంతాల్లోనూ పంట తడిచింది. పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో దళారులు రంగప్రవేశం చేశారు.

అమాంతం తగ్గించేశారు

దిగుబడులు తడవడాన్ని సాకుగా చూపి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. క్వింటా రూ.800 ప్రకారం కొంటున్నారు. కొంత బాగున్న దిగుబడులను క్వింటా రూ.1500 ప్రకారం కొంటున్నట్లు రైతులు తెలిపారు. క్వింటా రూ.4,400 ప్రకారం విక్రయించాల్సిన పంటను రూ.800 నుంచి 1500కే అమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు. మళ్లీ వర్షాలు మొదలవడంతో దళారులు కొనుగోలు చేసిన దిగుబడులను కూడా తీసుకెళ్లలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోయాపంట కల్లాల్లోనే ఉందని ఈసారి తడిస్తే అరకొర డబ్బులు కూడా రావని వాపోతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

- హేమసుందరరెడ్డి, వ్యవసాయాధికారి


కరిమద్దెల, పెసరవాయి గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన సోయాపంట వర్షానికి తడిచిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. పంట నష్టంపై సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

పెట్టుబడి కూడా రాలేదు - ఫక్కీరయ్య, కరిమద్దెల



నేను నాలుగెకరాల పొలం కౌలుకు తీసుకొని సోయాపంట వేశాను. ఎకరాకు కౌలు రూ.30 వేలు చెల్లించాలి. నాలుగెకరాల పంట పెట్టుబడి రూ.80 వేలు అయ్యింది. క్వింటా రూ.800 ప్రకారం విక్రయించాను. నాలుగెకరాలకు రూ.32 వేలు చేతికొచ్చింది. కౌలు సొమ్ము ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

దళారులు చెప్పిందే ధర - జనార్దన్‌రెడ్డి, కరిమద్దెల



తడిచిన ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయడం లేదు. దళారులు వచ్చి కొంటున్నారు. వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో వారు ఎంతకు కొనుగోలు చేసినా విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. నేను నాలుగెకరాల్లో పంట వేశా. పెట్టుబడులు కూడా రాలేదు.

చిరుత సంచారంతో కలకలం

మిడుతూరు, న్యూస్‌టుడే : మిడుతూరు సమీపంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి నీటికుంట ఆవరణలో ఉన్న ఫిల్టర్ బెడ్ల వద్ద శనివారం రాత్రి నుంచి చిరుత నిద్రిస్తున్నట్లు తాను చూశానని అక్కడ పని చేస్తున్న మధు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన రోళ్లపాడు డీఆర్వో తాహెర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ సిబ్బంది వచ్చి నీటికుంట ఆవరణ, సమీప ప్రాంతాలను పరిశీలించారు. చిరుతవిగా భావిస్తున్న కాలి గుర్తుల ఫొటోలు తీసుకుని ఉన్నతాధికారులకు పంపామని, వారి ఆదేశాల మేరకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, ఇక్కడ సంచరిస్తోంది చిరుతా కాదా అన్నది నిర్ధారిస్తామని డీఆర్‌వో తాహెర్ వెల్లడించారు.

బంగారు నగల చోరీ

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యలూరి మెట్టలో ఉన్న ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు గ్రామీణ సీఐ అస్రర్‌బాషా సోమవారం తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి తమ సొంతూరైన శిరివెళ్ల మండలం కామినేని పల్లె గ్రామానికి భార్య పిల్లలతో కలిసి దసరా పండగకు వెళ్లారన్నారు. సోమవారం ఉదయం తిరిగొచ్చి చూసే సరికి ఇంటికి తాళం పగులగొట్టి ఉందన్నారు. దీంతో ఆయన గ్రామీణ పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. బీరువాలోని 5 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నేలవాలిన వరిపైరు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : అకాల వర్షాల కారణంగా బండిఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట దెబ్బతింది. ఈర్నపాడు, బండిఆత్మకూరు, సంతజూటూరు, పార్నపల్లె, ఎ.కోడూరు తదితర గ్రామాల్లోని వరిపైర్లు నేలవాలాయి. ప్రస్తుతం ఎన్ను దశలో ఉన్న పైరు నేలకొరుగుతుండటంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నేలవాలిన వరిపైర్లను కట్టులు కట్టి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



ఈర్నపాడు గ్రామ శివారులో నేలకొరిగిన వరిపైరు

విత్తన నాణ్యతలో తేడాలొస్తే చర్యలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : విత్తనాల నాణ్యతలో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావుతో కలిసి సోమవారం ఆయన ప్రభుత్వం రాయితీపై రైతులకు ఇచ్చే శనగ విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్న బాలాజీ సీడ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు నాణ్యత ఉండాలన్నారు.

పంట కోతలు నిలిపేయాలి

వెలుగోడు, న్యూస్‌టుడే : తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టే వరకు పంట కోతలు నిలిపివేయాలని ఏవో పవన్‌కుమార్ రైతులకు సూచించారు. వెలుగోడు మండలంలో సాగు చేసిన వివిధ పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న, వరి, మినుముతో పాటు కూరగాయల పంటల్లో తెగుళ్లు వ్యాపించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పంటల్లో అధికంగా నిల్వ ఉన్న నీటిని బయటికి తరలించాలన్నారు. మొక్క త్వరగా కోలుకోవడానికి ఎకరాకు 40 కిలోల యూరియా వేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న గాలింపు

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని ఎస్సార్బీసీ కాల్వలో ఆదివారం గల్లంతైన వెన్నెల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. సోమవారం గజ ఈతగాళ్ల సాయంతో ముమ్మరంగా గాలించారు. సాయంత్రం వరకు మహిళ ఆచూకీ లభించ లేదని ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

సంజామల, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్య



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మని ప్రొటెక్షన్ ఏఈ భానుచందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పేరుసోముల విద్యుత్తు ఉపకేంద్రంలో ఒక వైపు వర్షం కురుస్తున్నా.. మరోవైపు ప్రొటెక్షన్ ఏఈ, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల తదితర మండలాలతో పాటు జిల్లాలోని 74 విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతులు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒప్పంద పద్ధతిన పని



పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

చేస్తున్న అధ్యాపకులను కూటమి ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఒ.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పసుపు రంగు రిబ్బన్లను ధరించి విధులకు హాజరై వారంతా నిరసన తెలిపారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ఇంతవరకు రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామయ్య, వీరన్న, మురళీమోహన్, పద్మావతి, శ్రీలత పాల్గొన్నారు.

రాష్ట్ర పండగలా వాల్మీకి జయంతి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగలా గుర్తిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమని వాల్మీకి సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బయ్య అన్నారు.

దొర్నిపాడు: ఈ నెల 17న ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించాలని మండల వాల్మీకి సంఘ అధ్యక్షుడు బోయ బాలవుసేని పేర్కొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

స్పందనకు వందనం

క్రిష్టిపాడు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు ప్రాథమిక పాఠశాల సమీపంలోని ముళ్లపొదల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రికల తీరుపై 'నియంత్రిక.. ప్రమాదాల సూచిక' పేరిట సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఏఈ మోహన్, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎస్.నాగన్న ముళ్లపొదలు తొలగింపజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల: **సమస్య:** గోవిందపల్లె ప్రధాన రహదారిపై మురుగు నిల్వ ఉంది. –రాకేశ్.

సమాధానం: మురుగు మళ్లించేలా చర్యలు తీసుకుంటాం.
–లక్ష్మీ మనోహర్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి.

నీటి కష్టాలు దూరమయ్యేనా..?

✦ గండ్లేరు సామర్థ్యం పెంపుపైనే ఆశలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డను పీడిస్తున్న మంచినీటి సమస్యను తీర్చాలని కూటమిపైనే ప్రజలంతా ఆశలు పెట్టుకున్నారు. గండ్లేరు సామర్థ్యం పెంపునకు ఎమ్మెల్యే అఖిలప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పలుసార్లు ప్రస్తావించడంతో ఈ వేసవిలోనైనా మంచినీటి సమస్య తీరుతుందని భావిస్తున్నారు. ఆళ్లగడ్డకు వరప్రసాదినిగా తెలుగు గంగను చెప్పుకోవచ్చు. కృష్ణా జలాలు తెలుగు గంగ రూపంలో ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి రావడంతో ఆళ్లగడ్డ దశ, దిశ మారింది. ఓ వైపు సాగునీటి కష్టాలు తీరడంతో పాటు, తాగునీటి కష్టాలు తగ్గాయని చెప్పొచ్చు. ఈ నీటి ఆధారంగానే రుద్రవరం పరిధిలో గండ్లేరు జలాశయాన్ని (తుండ్ల వాగు) నిర్మించారు. ఈ జలాశయ సామర్థ్యం 0.32 టీఎంసీలు. తెలుగు గంగ ప్రధాన కాల్వ నుంచి వచ్చే నీటిని గండ్లేరు జలాశయం వద్ద నిల్వ ఉంచి ఇక్కడి నుంచి వైఎస్ఆర్ జిల్లాకు మళ్లిస్తారు. ఈ జలాశయం ఆధారంగానే హరినగరం వద్ద సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ ఏర్పాటు చేశారు. మూడు దశల్లో 42 గ్రామాలకు నీరు అందించాలని నిర్ణయించారు. జలాశయ నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో వేసవిలో నీటి లభ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

కసరత్తు ప్రారంభం

ఆళ్లగడ్డ పురపాలికతో పాటు, ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల పరిధిలో 35కు పైగా గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి గండ్లేరు జలాశయ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలుగు గంగ అధికారులతో చర్చలు జరిపారు. జలాశయం ఉన్న ప్రాంతంలోనే పూడిక తొలగించడంతోపాటు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చూడాలని సూచించారు. అధికారులు తొలి దశ ప్రతిపాదనలు సిద్ధం చేయడం, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి జలాశయ సామర్థ్యం పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించడంతో పాటు బడ్జెట్‌పై కూడా ప్రతిపాదనలు ఇవ్వాలన్న సూచనలు రావడంతో అందరిలో ఆశలు రేకెత్తుతున్నాయి.

రూ.40 కోట్లతో పనులు

తెలుగు గంగ నీటి ఆధారంగా నిర్మించిన గండ్లేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 0.32 టీఎంసీ కాగా దీన్ని 0.9 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కార్యాలయం సూచనప్రాయంగా అంగీకారం తెలపడంతో ఆళ్లగడ్డకు తాగునీటి కష్టాలతోపాటు, కొంత మేర సాగునీటి అవస్థలు తీరే అవకాశాలు మెరుగయ్యాయి. రూ.40కోట్లతో గండ్లేరు జలాశయ సామర్థ్యం పెంపు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. హరినగరం సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా మూడు దశల్లో 42 గ్రామాలకు నీరు అందించేందుకు వీలుంటుంది. మొదటి దశలో ఉన్న ఐదు గ్రామాలకు రోజుకు 14 లక్షల లీటర్ల నీటిని తాగునీటి అవసరాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా వదులుతున్నారు. ఈ నీరు హరినగరం, నరసాపురం, ముత్తలూరు, నల్లవాగుపల్లె గ్రామాల తాగునీటి అవసరాలు తీరుస్తూ ఆళ్లగడ్డ పురపాలికకు చేరేసరికి 10లక్షల లీటర్ల నీరు మాత్రమే చేరుతుంది. ఇంకా పథకం కింద రెండు, మూడు దశలకు నీరు అందాల్సి ఉంది. మొత్తం మీద మూడు దశల్లో 42 గ్రామాలకు నీరు అందించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. గండ్లేరు జలాశయ నీటి సామర్థ్యం పెంపుతో పాటు, హరినగరం సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లోని మూడు దశలను పూర్తి చేస్తే దాదాపు ఆళ్లగడ్డలో చాలా గ్రామాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

☛ సాగునీటి సంఘం ఎన్నికలు పూర్తి కాగానే గండ్లేరు జలాశయ సామర్థ్యం పెంపుపై దృష్టి సారిస్తామని తెలుగు గంగ అధికారులు అంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో చర్చలు జరిపామని, వారి సూచనల ప్రకారం ముందుకు వెళ్తున్నామని వారు చెబుతున్నారు.



గండ్లేరు జలాశయం

మూడు దశలు ఇలా

తొలిదశ: హరినగరం, నరసాపురం, మత్తులూరు, పడకండ్ల, ఆళ్లగడ్డ (పూర్తి స్థాయిలో అమలు)

రెండో దశ: ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, పాలసాగరం, ఎంవీ నగరం, పి.చింతకుంట, దేవరాయపురం, నల్లవాగుపల్లె(పనుల కొనసాగింపు)

మూడో దశ: తిప్పారెడ్డిపల్లె, తువ్వపల్లె, రెడ్డిపల్లె, రుద్రవరం, రామాపురం, ఆర్.నాగులవరం, యాదవాడ, మిట్టపల్లె, మర్రిపల్లె, ఆర్.కృష్ణాపురం, కొండంపల్లె, బాచేపల్లె(పనులు ప్రారంభం కావాల్సి ఉంది)

అవీ.. ఇవీ.. అన్నీ..

కోవెలకుంట్ల గ్రామీణం: అమడాలలో చర్చి వద్ద మంచి నీటి పైపులైన్ దెబ్బతిని నీరంతా వృథా అవుతోంది. రహదారిపైకి వస్తుండటంతో అధికారులు చర్యలు తీసుకుని పైపులైన్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.

దొర్నిపాడు: అమ్మిరెడ్డినగర్‌లో ఏడుగురు జూదర్లను అరెస్ట్ చేసి రూ.5150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేష్ సోమవారం తెలిపారు.

అవుకు: వీధిలో కన్పించిన కొండచిలువను తరిమే క్రమంలో గ్రామానికి చెందిన డి.కంబగిరి రాముడు మెడలో వేసుకోవడం కలకలం రేగింది. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో అధికారులు వివరాలు సేకరించారు.

బేతంచెర్ల: గూటుపల్లెకు చెందిన నాయిని ఎల్లరాజు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రమణ సోమవారం రాత్రి తెలిపారు.

అవుకు: ఉదయం నుంచి కురుస్తున్న వానలతో మొక్కజొన్న రైతుల్లో కలవరం మొదలైంది. శింగనపల్లె, మెట్టుపల్లె, చెన్నంపల్లెల్లోని కల్లాల్లో, రోడ్ల వెంట ఆరబోసిన పంటల్నికాపాడుకోవడం కష్టమవుతోందని తెలిపారు.

ఆళ్లగడ్డ: విశ్వరూప ఆచారి కాలనీలో వెలిసిన కాళికా మాతాలయంలో దసరా ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు దురుగడ్డ రవీంద్రాచారి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారులకు, విద్యుత్తు, పారిశుద్ధ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అవుకు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన సోమవారం అవుకులో సమీపంలో జరిగింది. బెంగళూరు నుంచి నంద్యాల వెళ్తున్న ప్రయివేటు బస్సు స్థానిక పెట్రోలు బంకు సమీపంలో రెండు ద్విచక్ర వాహనదారులపైకి వెళ్లడంతో రాఘవ, విశ్వనాథ్‌లకు బలమైన గాయాలుకాగా, నంద్యాల వైద్యశాలకు తరలించారు. మరో వాహనంపై వెళ్తున్న నబిరసూల్, ఉసేన్‌బాష స్వల్ప గాయాలు తగలడంతో స్థానిక వైద్యశాలలో చికిత్స అందించినట్లు ఈఎంటీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

డోన్ నేరవిభాగం: మద్యం దుకాణాల లాటరీలో డోన్‌కు చెందిన తండ్రీ కొడుకులు షాపుల్ని దక్కించుకున్నారు. డోన్ పట్టణంలోని 68వ దుకాణాన్ని తండ్రి ఆలా ప్రహ్లాదుడు, 69వ దుకాణాన్ని కొడుకు ఆలా శ్రీనివాసులు సొంతం చేసుకున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరికి రెండు మద్యం దుకాణాలు రావడంపై అంతా చర్చించుకుంటున్నారు.

ఘనంగా వసంతోత్సవం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో దసరా నవరాత్రులు ముగిశాయి.



రంగులు చల్లుకుంటూ యువకుల కేరింత

సోమవారం అమ్మవారిని అలంకరించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం యువకులు, పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని జరిపారు. వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు గుండా గోపాల్, అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు, సభ్యులు బచ్చు సుబ్రహ్మణ్యం, బైసాని శేషఫణి, జగన్మోహన్ రావు, శేషమోహన్, జీవీఎస్ గుప్త, చిన్ని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత గ్రామోత్సవం

ప్యాపిలి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ముగింపులో



ప్యాపిలి: ఊరేగింపులో పాల్గొన్న యువకులు

భాగంగా ఆర్యవైశ్య సోదరులు సోమవారం వాసవీమాత ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి పట్టణ పుర వీధుల గుండా ఉత్సవ ఊరేగింపు చేపట్టారు. ఆర్యవైశ్య సోదరులు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని జరిపారు.

అమ్మవారికి పూజలు



రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ఉదయం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి పూజలు చేపట్టారు. ఆర్యవైశ్యులు వసంతోత్సవం నిర్వహించారు.

రుద్రవరం: అమ్మవారి పల్లకి

కొత్త భవనం నిర్మించరూ!



కోవెలకుంట్ల మండలంలోని సౌదరదిన్నెలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు కొత్త భవనం నిర్మించాలని ఉపాధ్యాయులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి కొత్త భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు

–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

నిర్లక్ష్యం...ప్రమాదానికి సంకేతం



గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోకి వస్తున్న మినీ వ్యానులో కొంతమంది ప్రయాణికులు ప్రమాదపు టంచున కూర్చొని ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. టాపుపై కూర్చొని ప్రమాదమని తెలిసినా.. చోదకులు నిబంధనలను పాటించడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

అభివృద్ధి పరుగులిక: ఎమ్మెల్యే

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రజలకు మంచి రోజులు వచ్చేశాయని, ఏపీ అభివృద్ధి బాట పట్టనుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. అహోబిలంలో సోమవారం 'పల్లె పండగ'లో భాగంగా ఆమె తొలుత అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చేరు



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

కుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో రూ.40లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గూడూరు సంజీవరాయుడు, ఎస్ఎల్ రమణ, అంజి, డా.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గుండంపాడు(శిరివెళ్ల), న్యూస్‌టుడే: ప్రజా సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని జిల్లా డ్వామా పీడీ జనార్దన్‌రావు, మండల తెదేపా నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహదేవపురం, గుండంపాడు, బోయలకుంట్ల గ్రామాల్లో పలు పనులను ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు కలిసి ప్రారంభించారు.

చిన్నమల్కాపురం(డోన్), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రగతి కాంతులు కన్పించాలనేదే ప్రభుత్వ ఆశయమని ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చిన్నమల్కాపురంలో సీసీరోడ్లకు రూ.40 లక్షలతో నిర్మాణానికి గానూ భూమిపూజ చేపట్టారు. ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో సాల్మన్ అన్నారు. సోమవారం ఆకుమల్లలో రూ.20 లక్షలు, ఆల్వకొండలో రూ.20 లక్షలు, ముదిగేడులో రూ.10లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయా గ్రామాల సర్పంచులు, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రారంభించారు. ఆకుమల్ల గ్రామ సచివాయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మాయలూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి నిధులు సద్వినియోగం చేసి మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే పల్లెల ప్రగతి సాధ్యమౌవుతుందని ఉపాధి శాఖ నంద్యాల జిల్లా ఏపీడీ సాంబశివరావు పేర్కొన్నారు. ఎస్.కొత్తపల్లె, అల్లూరు, మాయలూరు, రూపనగుడి గ్రామాల్లో రూ 42 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొర్రపాటి సుధాకరరెడ్డి, ప్రసాదరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తిరుపాల్‌రెడ్డి బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సుదర్శనరెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బి.తండా, జి.తండా(బేతంచెర్ల), న్యూస్‌టుడే: గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అందరూ భాగస్వాములు కావాలని మండల నోడల్ అధికారి బసీరున్నీసా బేగం, ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ అన్నారు. సోమవారం బి.తండా, జి.తండాల్లో సర్పంచి ఆదిలక్ష్మిబాయి, పీఆర్ ఏఈ మహేశ్ ఆధ్వర్యంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పలుకూరు, పెద్దరాజుపాలెం, చిన్నరాజుపాలెం గ్రామాల్లో ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. పసుపలలో రూ.30లక్షలు, పెద్దరాజుపాలెంలో రూ.25లక్షలు, చెర్లోకొత్తూరు గ్రామంలో రూ.10 లక్షలు, చిన్నరాజుపాలెం గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రహదారులకు భూమిపూజ నిర్వహించారు.

చింతలచెరువు(చాగలమర్రి), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పలు గ్రామాల అభివృద్ధి జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ తెలిపారు. సోమవారం చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో దాదాపు రూ.53 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణ పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలుచట్ల, పోతుదొడ్డి, పెద్దపూదెళ్ల గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి ఆయన మాట్లాడారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెదేపా మండల అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గొర్విమా



గొర్విమానుపల్లెలో భూమిపూజ చేసిన తెదేపా మండల అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి

నుపల్లె, పెట్నికోట గ్రామాల్లో సోమవారం సిమెంటు రోడ్లకు భూమి పూజ చేశారు.

గుండుపాపల(దొర్నిపాడు), న్యూస్‌టుడే: గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో సోమవారం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం ఆరురకాల పనులతో దాదాపు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు వేయడానికి భూమి పూజ జరిపారు. బుర్రారెడ్డిపల్లెలో రూ.10 లక్షలతో పలు పనులకు భూమి పూజ చేపట్టారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అమడాల, సౌదరదిన్నె, గుంజలపాడు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. సోమవారం అమడాలలో రూ.10లక్షలు, సౌదరదిన్నెలో రూ.10లక్షలు, గుంజలపాడులో రూ.15 లక్షలతో సీసీ, మురుగు కాల్వల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

దొర్నిపాడు: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం దొర్నిపాడు మండలంలో పర్యటించనున్నారు. 'పల్లె పండగ'లో భాగంగా అభివృద్ధి పనులకు భూమి పూజలు, అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే మండల సర్వసభ్య సమావేశానికి హాజరవుతారని ఎంపీడీవో సావిత్రి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

డోన్, న్యూస్‌టుడే: మాదాసి, మాదారి కురువల సమస్యలపై కలసికట్టుగా కృషిచేయాలని మాదాసి, మాదారి కుర



చర్చిస్తున్న మాదాసి, మాదారి కురవ సంఘం నాయకులు

వల సంఘం నాయకులు రంగన్న, ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో మాదాసి, మాదారి కురువల పాత్రపై ఆలోచించాలన్నారు మాదాసి, మాదారికురవలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే కులగణనలో మాదాసికురవ, మాదారి కురవలను గుర్తించి సరైన న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెద్దరాజులు, రంగనాథం, మునిస్వామి, బాలమద్దిలేటి, వెంకటరమణయ్య, శివ, కిష్టన్న, రవి, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

అన్నం వడ్డించడం అదృష్టం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఆకలితో ఉన్నవారికి అన్నం వడ్డించడం అదృష్టంగా భావించాలని డాక్టర్ చరణ్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి సూరా మధుసుధాకర్‌రెడ్డి, రాజు ఆధ్వర్యంలో శివశంకర్‌రెడ్డి(మధుసాయి) సహకారంతో రోగులకు, గర్భిణిలకు అన్నదానం అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణారెడ్డి, వలిబాష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి వెండి కంచాలు విరాళం

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరంలోని చౌడేశ్వరి కోవెలకు ధర్మవరానికి చెందిన కందికుంట శ్రీనివాస్ కుటుంబసభ్యులు రూ.45,500లు విలువ చేసే 415 గ్రాముల వెండి హారతి ప్లేటును ఆలయాధికారిణి కామేశ్వరమ్మకు సోమవారం అందజేశారు. నంద్యాలకు చెందిన శ్రీకాంత్ కుటుంబసభ్యులు కేజీ వెండి గల రెండు కంచాలను ఆలయాధికారిణి కామేశ్వరమ్మకు సోమవారం అందచేశారు. అర్చకులు, ఆలయసిబ్బంది, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ఆలయాధికారిణి కామేశ్వరమ్మకు విరాళం అందజేస్తున్న దాతలు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: కోట్ల

చిన్నపూదెళ్ల(ప్యాపిలి), న్యూస్‌టుడే: చిన్నపూదెళ్లకు చెందిన పి.కౌలుట్ల భార్య లక్ష్మీదేవి (40) అనారోగ్యంతో



నివాళులు అర్పిస్తున్న కోట్ల దంపతులు

మృతి చెందారని తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ స్వగ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి నేడు బేతంచెర్ల మండలంలో పర్యటిస్తారని తెదేపా మండల కన్వీనరు ఉన్నం ఎల్లనాగయ్య సోమవారం రాత్రి తెలిపారు. ఆర్.కొత్తపల్లెలో ఉదయం 9గంటలకు, బుక్కాపురం గ్రామంలో 9.30 గంటలకు పల్లె పండగలో పాల్గొంటారని, ఉదయం 10గంటలకు ప్రభుత్వ అతిథి గృహంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని తెలిపారు.

రతన్ టాటాకు నివాళి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రజ్ఞ పాఠశాల



రతన్ టాటాకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు రతన్ టాటా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు టి.అమీర్ బాషా మాట్లాడుతూ టాటా వంటి వ్యక్తి భారత దేశంలో జన్మించడం భారతీయులందరి అదృష్టం అన్నారు. ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

చింతలచెరువు(చాగలమర్రి), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవార చింతలచెరువులో నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఎంపీడీవో మంజులవాణి, ఈవోపీఆర్డీ తాహీర్‌హుసేన్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి విద్యార్థుల ఎంపిక

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్‌గేమ్స్‌లో జిల్లాస్థాయికి



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కోటయ్య తెలిపారు.

రహదారి ప్రమాదంపై కేసు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: సౌదరదిన్నె దగ్గర ఈనెల 13న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఇల్లూరు కొత్తపేటకు చెందిన మహబూబ్‌బాషా (30) లారీని ఢీకొట్టి మృతి చెందిన విషయం తెలిసిందే. తమిళనాడుకు చెందిన లారీడ్రైవర్ అలగు నిర్లక్ష్యంగా వాహనాన్ని రోడ్డుపై ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి తండ్రి బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మూగజీవాల బెడద.. తీరని వ్యధ

పట్టణంలో మూగ జీవాలతో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. ఆవులు, కుక్కలు పాదచారులపైనా, వాహనచోదకులపైనా దాడులు చేస్తుండటంతో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఉంటోంది. పశువుల యజమానులు ఇష్టానుసారంగా వాటిని రోడపైకి వదిలేస్తున్నారు. ప్రధాన రహదారులు, పాఠశాలల పరిసరాలు, రైల్వేస్టేషన్ ఆవరణ, సంతమార్కెట్ల పరిసరాల్లో ఇవి తిరుగుతూ పరిసరాల్ని అపరిశుభ్రపరుస్తున్నాయి. రహదారులపైకి ఇవి ఒక్కసారిగా వచ్చినప్పుడు వాటిని ఢీకొని పలువురు గాయాలపాలవుతున్నారు.

–న్యూస్‌టుడే, బేతంచెర్ల

బేతంచెర్లలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఒంటరిగా నడిచి వెళ్తున్నా, ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నా.. వెంట పడి బెంబేలెత్తిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. గుంపులు గుంపులుగా ఇవితిరుగుతూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. డోన్ క్రాస్‌రోడ్డు, కొత్త



కొత్తబస్టాండు సమీపంలో ప్రధాన రోడ్డుపై ఇలా..

బస్టాండు, నీళ్లట్యాంకు లైను, తహసీల్దార్ కార్యాలయం వీధి, దుర్గాపేట, పాతబస్టాండు, సబ్‌రిజిస్టర్ కార్యాలయం వీధి తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువని స్థానికులు వాపోతున్నారు. అంగళ్లబజారు, అమ్మవారిశాల కూడలి, కూరగాయల మార్కెట్‌లలో పశువులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. శేషారెడ్డి ఉన్నత పాఠశాల దగ్గర, పాఠశాల మైదానంలో, ప్రధాన రహదారుల మధ్య వాహనాలకు అడ్డుగా ఇవి రాకపోకలు సాగిస్తుండటంతో జనాలు ఇబ్బందులుపడుతున్నారు. పశువులను వాటి యజమానులు ఇష్టారాజ్యంగా వదలకుండా కట్టేసుకోవాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ అధికారులు కరపత్రాలను ముద్రించి అందజేయాలి. యజమానులకు నోటీసులు కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. పశువులను రహదారులపై వదిలితే స్వాధీనం చేసుకుంటామని కౌన్సిల్‌లో తీర్మానించాలి. ఆదిశగా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పోలీసు, నగర పంచాయతీ శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు రేగుతున్నాయి.

యజమానులకు తెలియజేస్తాం

–సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్, బేతంచెర్ల

పశువులను రోడ్లపైకి వదులుతున్నారు. వాటిని వదలకుండా కరపత్రాలను ముద్రించి యజమానులకు అందించేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే నోటీసులు జారీ చేస్తాం. బజారుల్లో రహదారులపై వదిలేయకుండా చర్యలు తీసుకుంటాం.